క్లుప్తంగా

చిత్రపటం బహూకరణ



ప్రవీణ్ ప్రకాష్‌కు చిత్రపటం అందజేస్తున్న ఉద్యోగులు

మధురపూడి: అమరావతి సచివాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నాబత్తుల రామ్మోహనరావు చిత్రపటాన్ని బహూకరించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి వెళ్లిన ఉద్యోగులు కోర్కెల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిత్రపటాన్ని అందజేశారు.

గైట్‌లో సెమినార్

రాజానగరం: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవ వికాసానికి ఉపయోగపడాలి గానీ, మానవ విలువలకు హాని కలిగించేలా ఉండకూడదని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి అన్నారు. కళాశాలలో హ్యుమానిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ (హెచ్‌బీఎస్) విభాగం ఆధ్వర్యంలో మానవతా విలువలు, సంస్కృతి, మానవ సంబంధాలు అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. నేటి ఆధునిక సమాజంలో పిల్లలు, పెద్దలు సెల్‌ఫోన్లకు అతుక్కుపోవడాన్ని ప్రస్తావిస్తూ ఇది మంచి పరిణామం కాదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రయ్య మాట్లాడుతూ మనిషి ఎదుగుదలకు టెక్నాలజీ ఎంత అవసరమో, సంస్కృతి, సంప్రదాయాలు కూడా అంతే అవసరమన్నారు.

యువతి అనుమానాస్పద మృతి



నాగేశ్వరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ తమ్మారావుపేటకు చెందిన ముప్పిడి నాగేశ్వరి (25) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పిడి కృష్ణ మూడో కుమార్తె నాగేశ్వరి జీఎన్ఎమ్ చదుకుని నాలుగేళ్లుగా రాజమహేంద్రవరంలోని డెల్టా హాస్పిటల్‌లో పని చేస్తోంది. విధులు ముగించుకుని సోమవారం రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చి పడుకుంది. మంగళవారం తెల్లవారుజామున తండ్రి కృష్ణ గుమ్ములూరుకు పని కోసం వెళ్లాడు. అనంతరం ఉదయం 8 గంటల సమయంలో అన్నయ్య కాటన్ దొర చూసేసరికి నాగేశ్వరి మంచం మీద నుంచి కింద పడిపోయి చలనం లేకుండా ఉంది. ఆమె కుడి చేతిపై ఇంజెక్షన్ చేసుకున్నట్టు ఆనవాలు ఉన్నాయి. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటనలో ఆస్పత్రిలో పని చేసే అనిల్‌పై కృష్ణ అనుమానం వ్యక్తం చేశారు.

కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని రాజా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకోగా, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రాంబాబు

జెడ్పీటీసీ దంపతులకు సత్కారం

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి వెలంపేట వినాయక ఆలయం వద్ద జెడ్పీటీసీ సభ్యురాలు, జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, అప్పాజీ దంపతులను మంగళవారం సత్కరించారు. జెడ్పీటీసీగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఊలపల్లి గ్రామస్తులు ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు సేవ చేసే అదృష్టం కలిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు శివ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీటీసీ రొంగల పద్మావతి, అప్పాజీ దంపతులను సత్కరించిన ఊలపల్లి గ్రామస్తులు

గణపతికి సహస్ర కలశాభిషేక పూజలు

పెదపూడి: మండలంలోని రామేశ్వరంలో నెలకొలిపిన రుద్రాక్ష మహాగణపతికి మంగళవారం సహస్ర కలశాభిషేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, ఆదిలక్ష్మి దంపతులు గణపతికి చక్రస్నానం చేయించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గాజుల మణికంఠ, గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, రావర్తి కృష్ణ, కొటికలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు. జి.మామిడాడలో బళ్లవందిరి వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.



రుద్రాక్ష గణపతికి చక్రస్నానం చేయిస్తున్న చినబాబు, ఆదిలక్ష్మి దంపతులు

ఉత్సాహంగా అద్వితీయ 2023

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాల కల్చరల్ డే సందర్భంగా అద్వితీయ 2023 పేరిట ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం మెడికోలు ఆటలు, పాటలతో హోరెత్తించారు. సంప్రదాయం, మోడ్రన్, పాశ్చాత్య ఇలా .. వివిధ రకాల డ్రెస్సులు ధరించి, వయ్యారాలు ఒలకబోస్తూ స్టేజ్ పై 'క్యాట్ వాక్' చేస్తూ చూసే కేరింతలు కొట్టించారు. 10 సింగిల్ షోలు, 8 డ్యుయెల్ షోలు, 10 గ్రూప్ డాన్స్‌లతో పాటు ఫ్యాషన్ షో, ప్లాష్ మాబ్ డ్యాన్స్, దాండియాతో సందడి చేశారు.



కల్చరల్ డేలో మెడికోల సందడి

గ్రామాల అభివృద్ధే యూబీఏ లక్ష్యం

రాజానగరం: వివిధ విద్యాసంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పర్చడమే ఉన్నత్ భారత్ అభియాన్ (యూబీఏ) ప్రధాన ఉద్దేశమని యూబీఏ ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంతీయ కోఆర్డినేటర్ డాక్టర్ పావని భీశెట్టి అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నత్ భారత్ అభియాన్ అమలుపై మంగళవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశాఖ రీజియన్ పరిధిలోని 11 జిల్లాల నుంచి 7,683 కళాశాలలు ఇంతవరకూ యూబీఏలో నమోదయ్యాయన్నారు. ఈ కళాశాలలు తమ సమీపంలోని ఐదు గ్రామాలను దత్తత తీసుకుని, వాటి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. 2047 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎం శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ వి.కుసుమ కుమారి, హెచ్ఓడీ డాక్టర్ బి.శ్రీనివాసరాజా, కోఆర్డినేటర్ డాక్టర్ పి.డార్విన్ పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలి

విద్యుత్తు శాఖ ఎస్ఈ మూర్తి

రంగంపేట: పని ప్రదేశాల్లో విద్యుత్ లైన్లు ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో విద్యుత్తు ప్రమాదాలపై విద్యుత్ సిబ్బందితో పాటు కొబ్బరి, పామాయిల్ రైతులు, దింపు కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు విద్యుత్ భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉద్యానవన తోటల్లో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. తోటలు, పొలాలు, ఇతర ప్రదేశాల్లో విద్యుత్తు సరఫరా అయ్యే తీగలు తెగిపడి ఉంటే వాటిని నేరుగా తాకకూడదన్నారు. వెంటనే విద్యుత్తు శాఖ సిబ్బందికి లేదా 19123 తెలియజేయాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటార్ స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయించాలన్నారు. విద్యుత్తుకు సంబంధించి ఏ పనులు చేస్తున్నా విధిగా చెప్పులు, చేతి తొడుగులు ధరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోలి రమణ, అనపర్తి ఏడీఏ పి.వన్యాసిరావు, ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ పాల్గొన్నారు.



విద్యుత్ భద్రతా అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ మూర్తి

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రంగంపేట: స్థానిక భవిత కేంద్రం వద్ద మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా చంద్రేడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గరిమెళ్ళ అరుణ విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాలు, వ్యక్తిగత ప్రగతి ఫైళ్లను పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు సేవ చేస్తున్న తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. రాజగోపాలపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సూర్యకృష్ణ భవిత పాఠశాల శాశ్వత నిధికి రూ.1000 అందించారు.

ఘనంగా ప్రభాత భేరీ ర్యాలీ

బిక్కవోలు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని కొంకుదురు పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకుల చిత్రపటాలు, జాతీయ జెండాలతో గ్రామంలో ప్రభాత భేరీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణరెడ్డి, వలీషా, సుధాకర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

పెదపూడి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద బుధవారం రైతులకు ఎలుకల నిర్మూలన కోసం బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేయనున్నట్లు మండల ఏఓ. టీవీఆర్ మణిదీప్ తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధుడికి గాయాలు

సీతానగరం: మండలంలోని కాటవరానికి 62 ఏళ్ల బొల్లి వెంకట రామయ్యను మోటారు సైకిల్ ఢీకొనడంతో గాయాలయ్యాయని, ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి మంగళవారం తెలిపారు. వెంకట రామయ్య సోమవారం తన మోటారు సైకిల్‌పై ఆర్వోప్లాంట్ వద్దకు క్యాన్‌తో వెళ్తుతుండగా, గుర్తు తెలియని వ్యక్తి మోటారు సైకిల్ ఢీకొందన్నారు. గాయపడిన అతడిని రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారన్నారు.

సస్యరక్షణపై అవగాహన సదస్సు

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరులో రైతులకు పంటల సస్యరక్షణపై విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ వీరబాబు, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఎం.నందకిషోర్, డాక్టర్ సీపీ నరసింహరావు వరి, అపరాల పంటలపై ఎరువుల యాజమాన్యం, కలుపు మందుల వాడకం, పురుగుల వల్ల వచ్చే తెగుళ్లపై సమగ్ర సస్యరక్షణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో సమష్టితత్వం



రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

అనపర్తి: క్రీడా పోటీల ద్వారా సమష్టితత్వం, క్రీడా స్ఫూర్తి పెంపొందుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. వివిధ క్రీడాంశాల్లో నిర్వహించిన ఎంపికలకు మొత్తంగా 1,450 మంది బాలురు, 300 మంది పీడీలు, పీఈటీలు హాజరైనట్లు ఆయన తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

సీతానగరం: నిడదవోలు మండలం గోవవరానికి చెందిన 31 ఏళ్ల ధామకుర్తి సుధాకర్‌పై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వెదుళ్లపల్లికి చెందిన బాలిక అదే గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదివింది. ఆ సమయంలో గోవవరం నుంచి వచ్చిన సుధాకర్ హైస్కూల్లో భవన నిర్మాణ పనులు చేసేవాడు. ఆ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న ఆ బాలిక సుధాకర్ వద్దకు వెళ్లగా, ఈనెల 23న గౌరీపట్నంలో వివాహం చేసుకున్నాడు. అయితే తన కుమార్తె కనిపించడం లేదంటూ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఆ బాలికను అదుపులోకి తీసుకుని విచారించగా పైవిషయాలు తెలిపింది. ఈ కేసును డీఎస్పీ దర్యాప్తు చేస్తారని ఎస్సై చిరంజీవి వివరించారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకుని, కుటుంబానికి, సమాజానికి సేవ చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరేరామ్ కృష్ణ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అనేది పిల్లలలో సంస్కారాన్ని పెంపొందిస్తుందన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ బి.మాధవ్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి ఎన్ఎస్ఎస్ దోహదం చేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ విభాగం కృషి చేయాలని అభిప్రాయపడ్డారు.

డోర్‌మేట్ల తయారీపై శిక్షణ

రాజానగరం: రైతు మహిళలకు వ్యవసాయంతో పాటు చేతివృత్తులలో శిక్షణ ఇచ్చి, వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కృషి చేస్తోందని రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అన్నారు. కొబ్బరి పీచుతో డోర్ మేట్లు తయారు చేసే విధానంపై రెండు నెలల పాటు కలవచర్ల కేవీకేలో ఇచ్చే శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ధవళేశ్వరంలోని ప్రాంతీయ క్వాయిర్ బోర్డు ఇన్‌చార్జి టీజే ఏసుదాసు మాట్లాడుతూ శిక్షణ కాలంలో నెలకు రూ.3 వేలు ఉపకార వేతనంగా అందజేస్తారన్నారు. కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడారు. ఈ రెండు నెలల శిక్షణకు 20 మంది రైతు మహిళలు హాజరయ్యారు. క్వాయర్ బోర్డు సహకారంతో చేతివృత్తుల విభాగం విశ్రాంత అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న రైతు మహిళలను కేవీకేను సంప్రదించాలని లేదా 87908 19002 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

కొమ్మల కత్తిరింపులో జాగ్రత్తలు అవసరం

రాజానగరం: పామాయిల్, కొబ్బరి తోటలలో కొమ్మలను కత్తిరించే సమయంలో పరిసరాలలో ఉన్న విద్యుత్ తీగలను కూడా దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టాలని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం డీఈఈ నటరాజన్ రైతాంగాన్ని హెచ్చరించారు. విద్యుత్ భద్రతా నియమాల పై మండలంలోని మల్లంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆ ప్రాంతానికి చెందిన రైతులతో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ వైఏఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

అనపర్తి: అనపర్తి సావరంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు బ్రోమోడయోలిన్ ఎలుకల నివారణ మందు ఎంపీటీసీ చినవెంకటరెడ్డి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ఏఓ బి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ బ్రోమోడయోలిన్ మందును వరిచేలల్లో ఎలుకల బొరియల్లో 10 గ్రాముల చొప్పున వేయాలని సూచించారు.